క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



స్వామి వారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

దెందులూరు: కొవ్వలి గ్రామంలో ఉన్నత పాఠశాల వెనుక ఉన్న శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయ 16వ వార్షికోత్సవ వేడుక గురువారం భక్తి శ్రద్ధలతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు స్వామివారికి వివిధ రకాల పుష్పాలతో విశిష్ట అలంకరణ పూజలు నిర్వహించారు.

జెండా పండుగకు ఏర్పాట్లు పూర్తి



స్వాతంత్ర్య దినోత్సవానికి సిద్ధమైన బీఆర్‌డీ నర్సింగ్ కళాశాల

దెందులూరు: ఆజాదీకా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం దెందులూరు బీఆర్‌డీ నర్సింగ్ కళాశాల శిక్షణ విద్యార్థులు కరస్పాండెంట్ నూకరాజు ఆధ్వర్యంలో 5వేల జాతీయ పతాకాలను పంపిణీ చేశారు. గురువారం ఉదయం 9వ వార్డు సెంటర్‌లో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు నాలుగు వైపులా వచ్చి వెళ్లే పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఆటోలు కార్లు ఆపి వారికి జాతీయ పతాకాలు స్వీట్లు పంపిణీ చేశారు. శుక్రవారం కళాశాలలో ఆగస్టు 15 వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని కరస్పాండెంట్ నూకరాజు వివరించారు.

హైస్కూలుకు విగ్రహాల అందజేత



హైస్కూలులో ఏర్పాటు చేసిన మహాత్ముల విగ్రహాలు ఇవే

ఉంగుటూరు: కైకరం జిల్లా పరిషత్ హైస్కూలుకు చెందిన పూర్వ విద్యార్థులు (1996–97 పదో తరగతి బ్యాచ్) దేశ నాయకుల విగ్రహలను పాఠశాలకు అందజేశారు. మహాత్మాగాంధీ, సుభాస్ చంద్రబోసు, స్వామి వివేకానంద, అబ్దుల్ కలాం, సావిత్రిబాయ్ పూలే, విగ్రహలను బహూకరించారు. విగ్రహాల ఏర్పాటుకు ఆర్థికంగా కోట దుర్గాప్రసాద్, బోయిన నాగు, ప్రియాంక సహకరించారు. కార్యక్రమంలో ఎలిశెట్టి శ్రీనివాస్, శానం హరి, కోట జ్యోతి, రంగశ్రీ, పార్వతి, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసు పాల్గొన్నారు.

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు



మరమ్మతులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

దెందులూరు: భారీ వర్షానికి సోమవరప్పాడు గ్రామంలో మూడు విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామ లైన్‌మెన్ కళ్యాణ్ చక్రవర్తి హైడ్రాలిక్ ట్రక్ సహాయంతో సుమారు 6 గంటల పైగా శ్రమించి మరమ్మతులు చేపట్టారు. నేలకొరిగిన మూడు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యాన్ని పునరుద్ధరించారు. గ్రామస్తులు మండల ఏఈ శ్రీనివాస్, లైన్‌మెన్‌కళ్యాణ్ చక్రవర్తిని అభినందించారు.

వెండి వస్తువుల చోరీ

జంగారెడ్డిగూడెం: వెండి వస్తువులు చోరీపై కేసు నమోదు చేశామని ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. స్థానిక శ్రీ సుందర బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త కర్రి శ్రీరామరెడ్డి, తన భార్య కంటి ఆపరేషన్ నిమిత్తం ఈ నెల 8న ఇంటికి తాళం వేసి విజయవాడ వెళ్లారని, 14వ తేదీ ఉదయం తమ ఇంటి తాళం పగులగొట్టి ఉందని స్థానికులు చెప్పడంతో వచ్చారని చెప్పారు. బీరువాలో ఉంచి సుమారు 7 కేజీల వెండి వస్తువులు చోరీకి గురైనట్టు బాధితుడు శ్రీ రామరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై తెలిపారు.

చోరీ కేసు నమోదు

జంగారెడ్డిగూడెం బండారువారి వీధికి చెందిన బండారు సుబ్బారావు ఈ నెల 11వ తేదీ రాత్రి ఇంటికి తాళాలు వేసి తన భార్యతో కలిసి తాడువాయి వెళ్లాడని హెచ్‌సీ టి.బాబూరావు తెలిపారు. తిరిగి 13వ తేదీ ఉదయం ఇంటికి రాగా, తాళాలు పగులగొట్టి ఉన్నాయని, బీరువాలోని బంగారు చైను, చెవి దుద్దులు, మ్యాటీలు సుమారు 4 కాసుల బంగారం చోరీకి గురైయ్యాయని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టామన్నారు.



స్వాతంత్ర సమరయోధుల పేర్లను ముద్రించిన శిలాఫలకం

స్వాతంత్ర్య సమరయోధులకు పుట్టినిల్లు గుండుగొలను

భీమడోలు: దేశం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్ర్య సమరయోధులకు జన్మస్థలం గుండుగొలను. ఉద్యమ స్ఫూర్తి గల ఈ గడ్డపై పుట్టిన ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు బ్రిటిష్ వారిని గడగడలాడించారు. గ్రామానికి చెందిన 23 మంది స్వాతంత్ర్య సమరయోధులను ఈ స్వాతంత్ర్య దినోత్సవ వేళ ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉంది. వారి పేర్లు గల జాబితాను గుండుగొలను సంతమార్కెట్ వద్ద వేదికపై మహాత్మాగాంధీ విగ్రహంతో పాటు భారీ శిలాఫలకంపై ముద్రించారు. వారిలో భోగరాజు, బందా, కొండ, మావులేటి, మంగళంపల్లి, దుర్గంపూడి, ఉనికిలి, ఉమ, బొమ్మ వంటి ఇంటి పేర్లు గల 23 మంది భారత స్వాతంత్ర్యోద్యమంలో కీలక పాత్ర పోషించి స్ఫూర్తిదాయకంగా నిలిచారు. వారిలో 20 మంది పురుషులు కాగా, ముగ్గురు మహిళాయోధులున్నారు. గుండుగొలను గ్రామానికి చెందిన భోగరాజు పట్టాభిసీతారామయ్య అంటే తెలియని వారు ఉండరు. స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో కీలకభూమిగా ఉండి భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలిచారు. ఆంధ్రాబ్యాంకు వ్యవస్థాపకుడిగా, ఎంపీగా, మహారాష్ట్ర గవర్నర్‌గా, నేషనల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పని చేశారు. గుండుగొలనుకు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన మహానీయుడు. మనకు స్వచ్ఛాయువులను అందించిన ప్రతి ఒక్కరిని మనమంతా స్మరించుకుందాం.

కుండపోత.. అన్నదాత గుండెకోత

- నీటమునిగిన వరిచేలు.. ఆందోళనలో రైతులు
- రికార్డు స్థాయిలో 159.6 మిల్లీ మీటర్ల నమోదు

ఉంగుటూరు: మండలంలో బుధవారం రాత్రి నుంచి కురిసిన రికార్డు స్థాయి వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వేలాది ఎకరాల పంటచేలు నీట మునిగాయి. దీంతో పంట ఆరంభంలోనే ఏమవుతుందోనని అన్నదాత గెండెల్లో దడ పుడుతుంది. యూటీ డ్రెయిన్లు, ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గురువారం ఉదయానికి 159.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. సుమారు 5 గంటలు ఏకధాటిగా కురిసిన వర్షంతో జనజీవనం స్తంభించిపోయింది. ఈ ఏడాదిలో ఇదే జిల్లాలో అత్యధిక ద్వితీయ స్థానంలో నిలిచిన వర్షపాతం. ప్రథమ స్థానం నిడమర్రులో నమోదైంది. దీంతో మండలంలోని డెల్టా ప్రాంతంలో ప్రవహించే తోకలపల్లి, పందికోడు మేజరు కోడులు అంచులు తాకుతూ ఉగ్రరూపంగా ప్రవహిస్తున్నాయి. గట్లు నాసిరకంగా ఉన్న చోట నీరు పంట పొలాల మీదకు చొరబడి ప్రవహిస్తుండటంతో తోకలపల్లి కోడు పరీవాహక ప్రాంత పంట పొలాలు నీట మునిగాయి. పత్తేపురం పంట కాలువకు నీరు వచ్చి పడిపోవడంతో రావులపర్రు ఆయకట్టు పొలాలు మరోమారు నీట మునిగాయి. కొల్లేరులో డ్రెయిన్లు కలిసే ప్రాంతంలో ఉన్న లంక గ్రామాలైన రామన్నగూడెం, వెంకట కృష్ణాపురం, బ్రహ్మనందపురం గ్రామాల ఆయకట్లు పొలాలు నీట మునిగాయి. తోకలపల్లి కోడు కొల్లేరులో కలిసే చోట గుర్రపు డెక్క అలుముకుపోవడంతో నీరు లాగడం లేదు. ఈ మూడు గ్రామాల ప్రజలు మునక ప్రమాదం ఉందని భయపడుతున్నారు. కైకరంలో పాతమాలపల్లి, సచివాలయ–2 ప్రాంతంలోకి, రైల్వే స్టేషన్ ప్రాంతంలో వర్షపు నీరు చేరింది. డ్రెయినేజీలు సరిగా లేకపోవడంతో కాకర్లమూడి, వీఏ పురం, దొంతవరం, బొమ్మిడి, కాగుపాడు, తదితర డెల్టా గ్రామాల లోతట్టు పొలాలు నీట మునిగాయి. ఉంగుటూరు మండలం వెల్లమిల్లి పంచాయతీలో కోటం నాగేశ్వరరావుకు చెందిన ఇల్లు, కాకర్లమూడిలో కొండపల్లి శ్రీనుకు చెందిన తాటాకు ఇల్లు కూలిపోయాయి. అధికారులు వారిని సురక్షిత ప్రాంతానికి తరలించారు.



యూటీ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న డ్రెయిన్



గుర్రపు డెక్కతో నిండిన డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న అధికారులు



బాదంపూడి ఆయకట్టులో నీట మునిగిన పంట చేలు



భీమడోలు బస్టాండ్‌లో ఏర్పడిన గుంతల్లో నిలిచిన వర్షపు నీరు



భీమడోలు ఎస్‌బీఐ వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న నీటితో అవస్థలు పడుతున్న వాహనదారులు

అధికారుల పర్యవేక్షణ

ఉంగుటూరు మండల తహసీల్దార్ పూర్ణచంద్ర ప్రసాద్ మండలంలో విస్తృతంగా పర్యటించారు. ముంపు నివారణకు తీసుకోవలసిన చర్యల గురించి అధికారులతో చర్చించారు. గురువారం కొల్లేరు ప్రాంతంలో నీరు వెళ్లని యూటీ మురుగు డ్రెయిన్లను పరిశీలించి, రామన్నగూడెం, వెంకటకృష్ణాపురం, బ్రహ్మనందపురం గ్రామాల రైతులు, ప్రజలతో మాట్లాడారు. మండల వ్యవసాయ అధికారి ఎస్ఎస్ ప్రవీణ్‌కుమార్ మండలంలో మునిగిన పంట పొలాలను పరిశీలించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు ముంపు పొలాలను గుర్తించారు. అయితే మునిగిన పంట చేలు నీరు లాగేస్తే నష్టం ఉండదని ఏవో ప్రవీణ్‌కుమార్ వివరించారు. సుమారు 4 వేల ఎకరాలు మండలంలో మునిగాయని ప్రాథమిక అంచనా వేసినట్లు ఆయన వివరించారు. డ్రెయిన్లు, ఇరిగేషన్ ఏఈ లు వెంకటేశ్వరరావు, సుధారాణి పర్యవేక్షించారు.

కొన్ని గంటల్లోనే భారీ వర్షపాతం నమోదు

భీమడోలు: అల్పపీడన ప్రభావంతో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రోడ్లపై నీరు చేరింది. డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉండడం వల్లే నీరు కిందకు వెళ్లే మార్గం లేక రోడ్లపై చేరుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. డ్రెయిన్లపై అక్రమ నిర్మాణాల వలన వర్షపు నీరు ముందుకు సాగని పరిస్థితి ఏర్పడింది. ఆక్రమణలు తొలగిస్తే.. వానా కాలం కష్టాలు తీరతాయని వ్యాపారస్తులు వాపోతున్నారు. కొన్ని గంటల పాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి పల్లపు ప్రాంతాల్లోని రోడ్లతో పాటు జాతీయ, రాష్ట్రీయ రహదారులపై నీరు నిలిచింది. 106.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావడంతో ఇదే ప్రథమం. భీమడోలు స్టేట్ బ్యాంకు వద్ద డ్రెయిన్ల నీరు రోడ్డుపై ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. భీమడోలు బస్టాండ్‌లో ఏర్పడిన భారీ గుంతలతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కొన్నేళ్లుగా బస్టాండ్‌లోని గోతులను పూడ్చకపోవడంతో ద్వారకాతిరుమల పుణ్యక్షేత్రానికి వెళ్లే నిత్యం వేలాది మంది భక్తులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మరో మూడు రోజులు వర్షాలు పడే అవకాశం ఉన్నందున గ్రామాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత ఉన్నతాధికారులు గ్రామ స్థాయిలో వరద నివారణ బృందాలను నియమించారు. భీమడోలు గ్రామ పంచాయతీ కార్యదర్శి కేవీ తనూజ ఆధ్వర్యంలో భీమడోలు, నాచేటిగుంట తదితర ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు.

దొంగ ఓట్లతో గెలిచి టీడీపీ సంబరాలు



నౌడు వెంకట రమణ

భీమడోలు: పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ గెలుపు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని, దొంగ ఓట్లతో గెలిచిన టీడీపీ సంబరాలు చేసుకోవడం వారి పిచ్చి చేష్టలకు నిదర్శనమని వైసీపీ రాష్ట్ర బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నౌడు వెంకట రమణ అన్నారు. పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం చంద్రబాబు, లోకేష్ పోలీస్, ఎన్నికల కమిషన్లను అడ్డు పెట్టుకొని దుర్మార్గపు పాలన చేసి అరాచకాన్ని సృష్టించారన్నారు. బయట వ్యక్తులతో ఓట్లు వేయించి, తాము ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు చేసినట్లు చెప్పుకుంటున్నారని, ఇది సిగ్గు అనిపించడం లేదా? అని ప్రశ్నించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో గూడుకట్టుకొని ఉన్నారన్నారు. రిగ్గింగ్ సిగ్గుచేటు స్వాతంత్ర్య దినోత్సవానికి ఒక రోజు ముందే కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని హత్య చేసిందని, ఇలాంటి ఎన్నికలు నా రాజకీయ జీవితంలో ఎన్నడూ చూడలేదని రాష్ట్ర వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ అన్నారు. ఈ రిగ్గింగ్ ప్రజాస్వామ్యానికి సిగ్గు చేటన్నారు.

ఉచిత బస్సు పథకంతో ఉపాధి కోల్పోతాం

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం నారాయణపురంలో ఉన్న ఆటో డ్రైవర్లు స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజును కలిశారు. ఉచితంగా మహిళలకు ప్రయాణ సౌకర్యం కల్పిస్తే తాము ఉపాధి కోల్పోతామని ఆందోళనను తెలియజేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఇప్పటికే తాము అనేక ఇబ్బందులతో ఆటోలు తోలుకుంటూ నానా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రవేశపెట్టిన ఉచిత బస్సు వల్ల మా ఇబ్బందులు మరింతగా పెరుగుతాయని తెలిపారు. ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు.

డ్రెయిన్లను ప్రక్షాళన చేయాలి

ఉంగుటూరు: డ్రెయిన్లు సరిగా ప్రవహించక, వర్షపు నీరు వెళ్లే దారి లేక పంట చేలు ముంపునకు గురవుతున్నాయని, ఈ సమస్య పరిష్కారం కోసం డ్రెయిన్లను శివారు వరకు ప్రక్షాళన చేయాలని స్థానిక ఎమ్మెల్యే పి.ధర్మరాజు అధికారులకు సూచించారు. ఈ పనులు ఒక్కరోజులో పూర్తయ్యేవి కాదు కాబట్టి.. నిర్దిష్ట ప్రణాళికతో వాటిని పూర్తి చేయాలని చెప్పారు. గురువారం స్థానిక తన క్యాంపు కార్యాలయంలో జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాలువలు, పంట కాలువలు 220 కిలోమీటర్ల మేరకు విస్తరించి ఉన్నాయని ఇరిగేషన్ ఏఈ సుధారాణి, డ్రెయిన్లు 300 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయని డ్రెయిన్ల శాఖ ఏఈ వెంకటేశ్వరరావు వివరించగా, ముంపు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే చెప్పారు. అటవీ, రెవెన్యూ తదితర శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పి.ధర్మరాజు

ఆ కుటుంబాలకు గుర్తింపు ఇవ్వాలి

బుట్టాయగూడెం: బ్రిటిష్ వారిపై తిరుగుబాటు చేసి ప్రాణాలు కోల్పోయిన గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు తగిన గుర్తింపు ఇవ్వాలని ఆదివాసీ మహాసభ అధ్యక్షుడు మిడియం వెంకటస్వామి, ఆ సంఘ న్యాయ సలహాదారు అయినారపు సూర్యనారాయణలు కోరారు. స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ వద్ద వారు విలేకర్లతో మాట్లాడారు. బ్రిటిష్‌వారితో పోరాడిన కారుకొండ సుబ్బారెడ్డి, ఆయన అనుచరుల వివరాలను ప్రభుత్వం సేకరించాలని, వారి కుటుంబాలకు గుర్తింపు ఇవ్వాలని కోరారు. అలాగే కేఆర్‌పురం ఐటీడీఏకు కారుకొండ సుబ్బారెడ్డి పేరును పెట్టాలని కోరారు. ఆదివాసీ మహాసభ ప్రతినిధులు రామాల యాకోబు, మిడియం వెంకటేష్, ముచ్చిక భాస్కర్ పాల్గొన్నారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

గణపవరం: సకాలంలో పిల్లలకు టీకాలు, వ్యాక్సిన్లు వేయించాలని, దీని వలన పిల్లలకు వ్యాధుల నుంచి రక్షణ ఉంటుందని ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి, ఎంఈవో గొర్రెల బాలయ్య అన్నారు. గురువారం గణపవరంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఇస్తున్న సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వ్యాక్సిన్ టీకాల ఆవశ్యకతను గుర్తించి ప్రతి తల్లి తమ పిల్లలకు విధిగా టీకాలు, వ్యాక్సిన్ ఇప్పించాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో అంటు వ్యాధులు, జ్వరాలు వ్యాప్తిచెందే అవకాశం ఎక్కువగా ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యసిబ్బంది ఇంటింటికి తిరిగి జ్వరాలపై సర్వే నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ఓంకార్‌నాథ్ మాట్లాడుతూ సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో ఏడాది లోపు బిడ్డలకు, గర్భిణులకు, స్త్రీలకు వ్యాధినిరోధక టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పిల్లలకు వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

సమైక్యతకు, సమగ్రతకు కృషి చేయాలి

ఏలూరు(మెట్రో): కలెక్టరేట్‌లోని సీపీఓ కార్యాలయంలో గురువారం హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని సీపీఓ సీహెచ్ వాసుదేవరావు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగి జాతీయ సమైక్యతకు, సమగ్రతకు కృషి చేయాలని సూచించారు. జాతీయ జెండా ఎంతో విశిష్టత ఉందని, పౌరులందరూ తమ ఇంటి వద్ద జాతీయ జెండాను పెట్టడం ద్వారా జాతీయ భావం ఉట్టిపడుతుందని, దేశ సమగ్రత, జాతీయ సమైక్యతకు త్రివర్ణ పతాకం స్ఫూర్తిగా నిలుస్తుందని వివరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బందితో కలిసి జాతీయ జెండా వద్ద సీపీఓ తదితరులు సెల్ఫీ దిగారు. అసిస్టెంటు డైరెక్టరు శ్రీదేవి, డిప్యూటీ ఎస్ఓలు జె.రాజశేఖర్, సీహెచ్ కేశవరావు, గంగాధర్, ప్రభాకర్‌రావు, డిస్ట్రిక్ విజన్ యాక్షన్ ప్లాన్ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పురావస్తు శాఖ ఆధ్వర్యంలో..

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పురావస్తు శాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక అగ్రహారంలోని పురావస్తు ప్రదర్శన శాల నుంచి అగ్రహారం, మెయిన్ రోడ్లలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఏలూరు పురావస్తు ప్రదర్శన శాల ఇన్‌చార్జి స్వర్ణ సత్యవతి మాట్లాడుతూ ప్రతి పౌరునిలో దేశభక్తిని పెంపొందించడం ఈ ర్యాలీ ఉద్దేశమన్నారు. మానవత స్వచ్ఛంద సంస్థ సహకారంతో నిర్వహించిన ఈ ర్యాలీలో ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.



సీపీఓ కార్యాలయంలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



పిప్పరలో భారీ జాతీయ పతాకంతో విద్యార్థుల ప్రదర్శన

గణపవరం: హర్‌ఘర్ తిరంగా ప్రచారంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని, ప్రతీ పౌరుడు దేశభక్తితో బాధ్యతగా ప్రవర్తించాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ శరణాలమాలతీరాణి, బీజేపీ మండల అధ్యక్షుడు కొయ్య వెంకట సుబ్బారావు అన్నారు. గురువారం గణపవరంమండలం పిప్పరలో హర్‌ఘర్ తిరంగా ప్రచారం నిర్వహించారు. హైస్కూలు, కాలేజి విద్యార్థులతో కలిసి పట్టణంలో భారీ జాతీయ పతాకంతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కూడలిలో మానవ హారం నిర్మించారు. కార్యక్రమంలో మోయ్యేరు నీటిసంఘం అధ్యక్షుడు దండు రామ చంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాష్టమి సందడి ప్రారంభం

గణపవరం: కృష్ణాష్టమి సందర్భంగా గ్రామాలలో పిల్లలు, యువకులు సందడి చేస్తున్నారు. విద్యాసంస్థలకు వర్షాల కారణంగా సెలవు ప్రకటించడంతో గురువారం పిల్లలు పెరుగుముంతలతో చందాలు వసూలు చేస్తూ సందడిగా కనిపించారు. ఏ గ్రామంలో చూసినా పిల్లలు, యువకులు గుంపులు గుంపులుగా గ్రామంలో ఇంటింటా తిరుగుతూ చందాలు వసూలు చేస్తున్నారు. శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా గ్రామాలలో ఉట్టికొట్టే కార్యక్రమం అట్టహాసంగా నిర్వహిస్తారు.

చదరంగం పోటీలు ప్రారంభం


జంగారెడ్డిగూడెం: 78వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా గురువారం జయప్రకాష్ నారాయణ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జేపీ సెంటర్‌లో ఏర్పాటుచేసిన చదరంగం పోటీలను స్థానిక మున్సిపల్ కమిషనర్ కేవీ రమణ ప్రారంభించారు. సుమారు 80 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరికి స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జేపీ సెంటర్లో జరిగే పాటల పోటీల అనంతరం బహుమతి ప్రదానం చేస్తారు.

వాగులు పొంగి.. పొలాలు నీటమునిగి

దెందులూరు: భారీ వర్షాలకు కొవ్వలిలో మొండికోడు, బుడమేరు వాగులు పొంగి పొర్లుతున్నాయి. రెండు వాగుల వరద ఉద్ధృతికి కొవ్వలిలో 100 ఎకరాలు వరి పంట ముంపునకు గురైంది. ఈ రెండు వాగులు వరద పెరిగినా, వర్షాలు ఆగకపోయినా కొవ్వలిలో మరింత ముంపునకు గురయ్యే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దెందులూరులో సైఫెన్‌పై నీటి ప్రవాహం క్రమేపీ పెరుగుతోంది. పెరుగుతున్న నీటి ప్రవాహాన్ని అంచనా వేసి దెందులూరు తహసీల్దార్ బీ.సుమతి, ఎస్సై ఆర్ శివాజీ సైఫన్ పై రాకపోకలను నిలుపుదల చేశారు. స్టాప్ బోర్డులను ఏర్పాటు చేశారు. సైఫన్‌లో బ్రిడ్జిల వద్ద కాపలాగా గ్రామస్థాయి ఉద్యోగులను ప్రత్యేక డ్యూటీలు వేసి రెండు వైపులా పెట్టారు. చిన్న దళిత వాడ వద్ద పైనుంచి వచ్చే వర్షపు నీరు సీతంపేట కాలువ నుంచి బయటకు రాకుండా ముందుగానే అధికారులు, రైతులు సంయుక్తంగా ఇసుక బస్తాలను రక్షణ గోడగా రెండుచోట్ల ఏర్పాటు చేశారు. జాతీయ రహదారిపై సర్వీస్ రోడ్‌లో పొలాలకు వెళ్లే దారి గండి పడింది. పైనుంచి వర్షపు నీరు అధికంగా రావటంతో పొలాలకు వెళ్లే రైతులకు అసౌకర్యం కలిగింది. రోడ్డు పక్కన 10 ఎకరాలు వరి పొలం నీట మునిగింది.



కొవ్వలిలో నీటమునిగిన వరి పొలాలు



ఉధృతంగా ప్రవహిస్తున్న బుడమేరు